# కవిత చదివి చూస్తా....

కవిత చదివి మీ మనసును
గాయపరచలేను
చదవకుండా నా మనసును
క్షోభపెట్టుకోను
ఏదయినా ఏమయినా
కవిత చదివి చూస్తా
పంచరత్నమాలికలను
సంచిలోంచి తీస్తా
వన్స్ మోర్ అనకున్నా
రెండుసార్లు చదువుతా
వన్సే బోర్ అనుకున్నా
చదివిందే చదువుతా
సుత్తిలెమ్మని అనుకున్నా
ఒత్తిఒత్తి పలుకుతా
మైకు చేతికొచ్చిందో
మైకం కమ్మేస్తుంది
కెమెరా కనిపించిందో
కేరింతలు వేస్తాను
విలేఖరే కనిపిస్తే
వీరంగం ఆడతాను
వినేవాడు దొరికాడో
విరగదీసి పారేస్తా

ఏదో ఒక మాత్ర వేసి
కవిభిషక్కునని పిస్తా
ఒక్కటైనా వినండి
నా కష్టం కనండి

అయితే......
విన్నా వినకున్నా
నా విచ్చుకత్తి తీస్తా
శుంఠా అని తిట్టినా
కంఠశోష ఆపను
కత్తులకు తుపాకులకు
బెదిరే రోజులు పోయాయ్
కవితలంటే భయపడే
గడ్డురోజులొచ్చేశాయ్
నాకవితలు మింగేసే
వింతజంతువు
చెత్తబుట్ట అంటే నాకు
చెడ్డ కోపము
నాకవితను వినవయ్యా
నీవేనా రోశయ్య
బాబ్బాబు వినుబాబూ
నాకు నీవే చంద్రబాబు
నా కవితను వినుభాయీ
నాకు నీవె వాజ్ పేయి
కంగారేం పడకు
బంగారం నా కవిత
కాకికవిత కాకికెపుడు
ముద్దేనని అనకు
యతిప్రాసలు కుదురుస్తా
మతులన్నీ పోగొడతా
గణాలన్నీ పేరుస్తా
గణాచారినని పిస్తా

ఇన్సూరెన్స్ చేసుకోండి
నా కవితలు వినండి
లేకుంటే కష్టాలకు
కారకుణ్ణి నేను కాను
నా కవితలు ముందుంటే
మందు ఎందుకు
సిగ్గుఎగ్గు లేకుండా
బిగ్గరగా చదువుతాను
కవితలెన్నియైనా
బాధ ఒక్కటే
కవులెందరు ఉన్నా
గాధ ఒక్కటే.

– హాస్యబ్రహ్మ శ్రీ శంకరనారాయణ